క్లుప్తంగా

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

ఫిరంగిపురం: ఆధార్ సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో డి.అనూ రాధ అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం –1,2 గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫిరంగిపురంలోని కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఫోన్ నెంబర్ ఆధార్‌తో అనుసంధానం, ఆధార్ సంబంధిత సమస్యలు ఉంటే వాటిని నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ సెంటర్లలో పరిష్కరిస్తారని చెప్పారు. ఆధార్‌లో పేరుమార్పు, పుట్టిన తేదీ, ఫోన్‌నెంబర్ అనుసంధానం వంటి వాటిని సరిచేసి నమోదు చేయనున్నట్లు తెలిపారు.

విపత్తుల కార్యాలయాన్ని సందర్శించిన ప్రొబేషనరీ అధికారి

తాడేపల్లిరూరల్: స్థానిక ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని బుధవారం ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి పంకజ్ కుమార్ మీనా సందర్శించారు. ఈ సందర్భంగా విపత్తుల సంస్థ అవలంబిస్తున్న సాంకేతికతను గురించి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పంకజ్ కుమార్‌కు వివరించారు. తుఫాన్లు, వరదలు, వడగాల్పులు, భారీ వర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి పంపించే కార్యాచరణను వివరించారు. వాతావరణ పరిశోధన విభాగాలలోని వివిధ అంశాలను, కామన్ అలెర్ట్ ప్రోటోకాల్, ఏపీ అలెర్ట్ ద్వారా ప్రజలకు హెచ్చరిక మెసేజ్ పంపించే విధానాలను, కమ్యూనికేషన్ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్, వాకీ టాకీ, విశాట్ కమ్యూనికేషన్ పరికరాల పనితీరును విపత్తుల సంస్థ ఈడీ డాక్టర్ సి. నాగరాజు, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.ఎం. అలీలు పంకజ్ కుమార్‌కు వివరించారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి


ఫిరంగిపురం: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని పోలేరమ్మ గుడి బజార్‌లో మండల పరిషత్ నిధులు నాలుగున్నర లక్షలతో నిర్మిస్తున్న సైడుకాల్వల నిర్మాణపనులకు బుధవారం ఆమె కొబ్బరికాయకొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి కృషి చేయలేదని చెప్పారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడాబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కె.చిన్నపురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, టి.శేషమ్మలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలించిన ఎంపీడీవో

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఆదేశం

తాడికొండ: బడేపురంలో నూతనంగా స్థలాలు మంజూరు చేసిన జగనన్న కాలనీని బుధవారం ఎంపీడీవో అత్తోట దీప్తి హౌసింగ్ డీఈ సీతారామయ్య ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా 725 ప్లాట్లు ఉన్న పెద్ద లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అర్హులకు ఇళ్లు మంజూరుకు సిద్ధంగా ఉన్నందున లబ్ధిదారులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ డీఈఈ సీతారామయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలతో పాటు సొంతింటి స్థలాలు ఉండి గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు కూడా ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుంది కనుక సొంతింటి స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గృహ నిర్మాణ శాఖ ఏఈఈ ఓబుల్ రెడ్డి పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ పరిధిలో రైల్వేస్టేషన్ శివారులో ఓ యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం యర్రబాలెంకు చెందిన నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు మంత్రి వంశీ (24) అమ్మమ్మ నాగేశ్వరమ్మ దగ్గర ఉంటున్నాడు. తండ్రి మంత్రి నాగేశ్వరరావు వంశీ చిన్నతనంలోనే ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. తల్లి శ్రీలక్ష్మి రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి అమ్మమ్మతో కలసి ఉంటున్నాడు. 10వ తరగతి చదువుకున్న వంశీ విజయవాడలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ అమ్మమ్మను చూసు కుంటూ ఈ మధ్యకాలంలో ఇంటిని కూడా కొనుగోలు చేశారు. ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని అమ్మమ్మ నాగేశ్వరమ్మ తెలియజేసింది. ఉదయం వంశీ స్నేహితులకు తను ఉన్న ప్రాంతాన్ని తన సెల్‌ఫోన్ ద్వారా లొకేషన్ షేర్ చేసి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులు లొకేషన్ ఆధారంగా సంఘటనా స్థలానికివచ్చి పరిశీలించగా అప్పటికే వంశీ మృతి చెంది కనిపించాడు. తెనాలి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి రైల్వే ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి, జరిగిన సంఘటనపై దర్యాప్తు చేపట్టారు.

పేదల కోసమే కమ్యూనిటీ భవనాల నిర్మాణం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- నీరుకొండ శిబిరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ భవనం ఆరంభం


హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: పేదలు శుభకార్యాలు, ఏదైనా కార్యక్రమాలు కల్యాణ మండపాల్లో చేసుకోవాలన్నా ఖర్చుతో కూడుకున్న విషయమని, అది గమనించి పేదలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ భవనాలను నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. బుధవారం నగర పరిధిలోని నీరుకొండ శిబిరంలో రూ. కోటి వ్యయంతో నిర్మించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావులు ప్రారంభించారు. తొలుత పక్కనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమ్యూనిటీ హాల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. భవన ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. భవనాన్ని స్థానికంగా ఉన్న పేదలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో పది కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రతి పేదవాడు తమ ఇంట్లో జరిగే ఏ కార్యాన్ని అయినా కమ్యూనిటీ హాల్స్‌లో చేసుకునేలా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో పలు కమ్యూనిటీ హాల్స్‌ను ప్రారంభించడం జరిగిందని, మిగిలిన కమ్యూనిటీ హాల్స్‌ను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పార్టీ నాయకులు ఈపూరి ఆదామ్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, బేతపూడి నర్సయ్య, సాలి ప్రశాంత్, కురగంటి ఆదామ్ పాల్గొన్నారు.

యర్రబాలెంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం

పేదలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్లాది రూపాయల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం బసవతారక నగర్‌లో రూ.1.05 కోట్ల నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న రెండు సీసీ రోడ్లు (మహాత్మా జ్యోతిరావు పూలే మార్గం, అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలామ్ మార్గం)లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆర్కే స్థానిక మహిళల చేతుల మీదుగా ప్రారంభింపజేసి అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో సుమారు రూ.12 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.85 లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయినేజీ నిర్మాణంతో పాటు రూ.మూడు కోట్ల వ్యయంతో రెండు బీటీ రహదారుల నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి అవరోధంగా ఉన్న ఆక్రమణలను తొలగించి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఈ కోటిరెడ్డి, స్థానిక నాయకులు గుండాల శ్రీనివాసరావు, దానబోయిన నాగయ్య, రేమిశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన


మాట్లాడుతున్న ఈదులమూడి దేవిడ్‌రాజు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై బుధవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై జరిగిన అవగాహనా సదస్సుకు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, తాడేపల్లి జెసియస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికి వైద్యం అందించి సేవలు చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యమిత్ర, ఏఎన్‌ఎంలతో ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబం వివరాలు తీసుకుని వారిలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అన్న విషయం తెలుసుకుని వారికి మెరుగైన వైద్యం అందించే విధంగా ప్రయత్నం చేయడమే లక్ష్యం అని, ఈ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సింహాద్రి గోపి, వేముల లక్ష్మీ రోజా, ముదిగొండ ప్రకాష్, గృహ సారధులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి


రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంగళగిరి: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని అంబేద్కర్ సెంటర్‌లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగ, మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల ఎంపీలు పార్లమెంటులో వర్గీకరణపై మాట్లాడి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ చేస్తే మాదిగలలో బీజేపీ చిరస్థాయిగా నిలుస్తుందని, లేదంటే మాదిగ ద్రోహిగా మిగిలిపోతుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలు విక్టర్‌పాల్, అద్దేపల్లి నాగేశ్వరరావు, పాతకోటి భాస్కర్, శ్యామల. జోజి, కోటిప్రకాష్, దానియేలు పాల్గొన్నారు.

తాడేపల్లిలో యువకుడు అదృశ్యం

- కాలవ ఒడ్డున దొరికిన సెల్‌ఫోన్
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


మిస్సింగ్ అయిన ఈదులమూడి రమేష్ (ఫైల్)

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలో నివాసముండే ఓ యువకుడు అనారోగ్యంతో బాధపడుతు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. అనంతరం అతని చెప్పులు, సెల్‌ఫోన్ బకింగ్ హామ్ కెనాల్ ఒడ్డున కనబడడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది బుధవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జరిగిన ఈ సంఘటనపై తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం తాడేపల్లి 1వ వార్డుకు చెందిన ఈదులమూడి రమేష్ (38) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యంగా ఉండడంతో దగ్గరలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోగా, కామెర్లతోపాటు ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని, వెంటనే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. భార్య ఈదులమూడి క్రీస్తుదేవి మెల్లెంపూడిలో ఉన్న ఈదులమూడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి డబ్బులు తీసుకు వస్తానని వెళ్లింది. తల్లిదండ్రులు కుమారుడితో మాట్లాడతానని కోరగా ఆమె ఫోన్ చేయగా అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. వెంటనే స్థానికంగా ఉన్న బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయితే బకింగ్‌హామ్ కెనాల్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న మెట్ల మీద చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. భార్య క్రీస్తుదేవి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

24న ఉచిత యోగా శిబిరం

మంగళగిరి: నగరంలోని మెయిన్ బజారు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఈనెల 24వ తేదీన శ్రీ ఆంజనేయ ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో ఉచిత యోగా శిబిరం నిర్వహించనున్నట్లు ధ్యాన మండలి కన్వీనర్ అత్తలూరి శివ శోభనాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ శిబిరంలో యోగా గురువు కిషోర్ శిక్షణా తరగతులను నిర్వహిస్తారని, పాల్గొనదలచిన వారు సెల్‌: 9440712208లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు స్ఫూర్తినిస్తున్న టెడ్ఎక్స్ వీవీఐటీ

పెదకాకాని: వీవీఐటీ విద్యార్థులు నిర్వహించిన టెడ్ఎక్స్ వీవీఐటీ చేజింగ్ వరల్డ్ (మారుతున్న ప్రపంచం) విద్యార్థులలో స్ఫూర్తి నింపడం, ప్రేరణ కలిగించే విధంగా సాగిందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన 9 మంది వక్తలు వారి జీవితానుభవాలను, అధిగమించిన సవాళ్ళను విద్యార్థులకు వివరించారు. జీవితంలో సవాళ్ళు ఎదురైనపుడు వాటిని అధిగమించి ఏ విధంగా ముందుకు సాగాలో తెలియజేస్తూ వక్తలు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్ట సమయాల్లో సరైన మార్గాలు ఎన్నుకునే విధంగా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ముఖ్య వక్తలుగా ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ ఘూగ్‌ధాని మనీస్, బ్రెయిన్ మై బ్రెయిన్ వ్యవస్థాపకురాలు, రచయిత అనిష్ బెహెటీ, టెస్టింగ్ సాఫ్ట్‌వేర్ నిపుణుడు భగేష్వర్ మోహన్, స్టెమీపై గాల్స్ ఫౌండర్ అనీషా మద్రవు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అందుకున్న లఘుచిత్ర దర్శకుడు దీపక్‌రెడ్డి, ప్రముఖ నటి సబా నటేష్, ఆర్కిటెక్ అశ్విని శ్వేత, విద్యార్థులు హర్ష, సమీరాలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, టెడ్ఎక్స్ సంధానకర్త పాలపర్తి బిందు మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుడి జేబుకు పానకం ఘాటు

పానకాల స్వామి అంటే తెలుగురాష్ట్రాల్లో చాలామందికి ఇలవేల్పు. మంగళాద్రి సన్నిధికి వచ్చి దర్శనం చేసుకుని ఆయనకు ఇష్టమైన పానకాన్ని నివేదించి వెళ్లడం అందరికీ ఆనవాయితీ. అయితే వీరు కొండకు వచ్చి తిరిగి వెళ్లే లోపల జేబులు ఖాళీ అయిపోతున్నాయి. పూజాద్రవ్యాలు నుంచి పానకం టికెట్లుకొనే వరకు భక్తులు దోపిడీకి గురవుతున్నారు. అడిగే వాడు లేకపోవడం.. పట్టించుకునే వాడు కానరాకపోవడమే.. ఇక్కడి వ్యాపారులకు, కాంట్రాక్టర్‌కు జేబులు నింపుతోంది.

- పానకాల స్వామి కొండపై భక్తులను దోచుకుంటున్న కాంట్రాక్టర్
- అధిక ధరలకు పానకంతో పాటు పూజా సామగ్రి అమ్మకాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- భక్తులకు మిగులుతోన్న ఆవేదన


20 రూపాయలు బాటిల్స్ మాత్రమే విక్రయిస్తున్న వైనం


బాటిల్స్, పూజాసామాగ్రి విక్రయిస్తున్న పూజారి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి ఎగువ సన్నిధిలో భక్తులు దోపిడీకి గురవుతున్నారనే ఆరోపణలున్నాయి. పానకం, పూజా సామగ్రి విక్రయాలు జరిపేందుకు ప్రతి ఏటా బహిరంగవేలం నిర్వహిస్తారు. అయితే గత 30 సంవత్సరాలుగా సంస్థలు మారినా కాంట్రాక్టర్ మాత్రం ఒక్కరే ఉండి దాన్ని దక్కించుకుంటుండడం విశేషం. 30 సంవత్సరాల క్రితం రూ.వేలతో ప్రారంభమై పానకం, పూజాసామగ్రి విక్రయ వేలం పాట నేడు రూ 1.60 కోట్లకు చేరుకుంది. ఇది పాడుకుని నిర్వహిస్తోంది మాత్రం ఒక్క కాంట్రాక్టర్. బహిరంగ వేలంలో మరి కొందరు పాల్గొని పాట పాడుకున్నా వ్యాపారం చేసే సమయంలో అడ్డంకులు సృష్టిస్తుండడం అధికారులు సైతం ఆ కాంట్రాక్టర్‌కే వత్తాసు పలుకుతుండడంతో మరలా వ్యాపారాన్ని అదే కాంట్రాక్టర్‌కు అప్పగించి వెళ్లిన ఘటనలున్నాయి. రెండు లీటర్ల పానకం రూ. 60 అమ్మాల్సి ఉండగా తులసి మాల, పటిక బెల్లంతో కలిపి రూ.100కి విక్రయిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను తులసిమాల, పటిక బెల్లం తీసుకోకపోతే పానకం టిక్కెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇక పూజా సామగ్రి, కొబ్బరి కాయలు నిబంధనలలో ఉన్న ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిరంతరం పర్యవేక్షించి భక్తులు దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఇదేమిటి ప్రహ్లాద!!

మంగళగిరి: ఎగువ సన్నిధిలోని శ్రీ పానకాల లక్ష్మీ నృసింహ స్వామి వారి పానకం వేలం పాటలో విజయవాడకు చెందిన శ్రీ ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు ఆటలాడుకుంటున్నారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది నిర్వహించే స్వామి వారి పానకం, పూజా సామగ్రి వేలం పాటలలో పాల్గొనే వారు తప్పనిసరిగా పాట అయిన వెంటనే పాట పాడుకున్న వారు తప్పనిసరిగా పూర్తి నగదు చెల్లించాలనే నిబంధన ఉంది. అయితే గత ఏడాది దీనికి విరుద్ధంగా విజయవాడ ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు పాటపాడగా వారికి గడువు ఇచ్చారు. గడువు తీరినా పూర్తిగా నగదు చెల్లించకపోవడంతో మళ్లీ పాటపెట్టాల్సి వచ్చింది. ఈ ఏడాది బుధవారం జరిగిన పాటలో పాల్గొన్న ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా పాట పాడారు. అయితే నగదు చెల్లించకపోవడం విశేషం. నిబంధనలు స్పష్టంగా చెప్పినా పాట పాడి నగదు తర్వాత చెల్లిస్తామని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు పాట రద్దు చేసి వాయిదా వేశారు. ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారి తీరుపై అధికారులతో పాటు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడా ఉండవు ఈ ధరలు!



పానకం టిక్కెట్ ఒక్కటే అడిగితే ఇవ్వడం లేదు. తులసి మాల, పటిక బెల్లం తప్పనిసరి అని రూ.100 తీసుకున్నారు. ఎక్కడా లేని విధంగా కొబ్బరికాయ రూ.40 తీసుకున్నారు. అన్ని ఆలయాలకంటే అధిక ధరలు ఇక్కడ ఉండటం మాకు ఆశ్చర్యం కలిగించింది.

– నాగరాజు ధర్మవరం భక్తుడు

తప్పనిసరై కొన్నా!



పానకం టిక్కెట్ తీసుకోవాలంటే మేం వద్దన్నా తులసి మాల, పటికబెల్లం ప్యాకెట్ ఇచ్చి రూ.100 తీసుకున్నారు. కొబ్బరికాయలతో వత్తులు అన్ని అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎవరికి చెప్పాలో తెలియక తప్పనిసరిగా వారు చెప్పిన ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

– చౌదప్ప ధర్మవరం, భక్తుడు

చర్యలు తీసుకుంటాం

ఎగువ సన్నిధిలో పానకం, పూజా ద్రవ్యాలు అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం ఇంత వరకు నా దృష్టికి రాలేదు. నిరంతరం పర్యవేక్షిస్తున్నా. ఒకవేళ అధిక ధరలకు విక్రయించినట్లు భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత కాంట్రాక్టర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ఎ.రామకోటి రెడ్డి, దేవస్థాన ఈఓ, మంగళగిరి

గ్రామాల్లో గణనాథుడికి విశేష పూజలు


తాతిరెడ్డిపాలెంలో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్


ఊరేగింపుగా తీసుకువెళుతున్న గణపతి విగ్రహం

తాతిరెడ్డిపాలెం(తాడికొండ): వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొలువుదీరిన గణనాథుడు గ్రామాల్లో భక్తుల నుంచి విశేష సేవలు అందుకుంటున్నాడు. బుధవారం తాడికొండ మండలం తాతిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొండా నాగార్జునరెడ్డి, నవీన్ రెడ్డి, కొండా కిషోర్ రెడ్డి, షేక్ సలీమ్, షేక్ మీరావలి, కొల్లికొండ వెంకటేశ్వరరావు, రావూరి నరేష్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడికొండలో...

తాడికొండ రజక బజార్ పెద్దబావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మండల వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, బండారుపల్లి సర్పంచ్ ముప్పాళ్ళ మనోహర్, కొమ్మినేని పున్నారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల నరసింహా రావు, స్థానిక ఎంపీటీసీ జూపల్లి నాగేంద్రం, మెంబర్ ముక్కెర శివకృష్ణ, సచివాలయ కన్వీనర్ షేక్ మస్తాన్ పలువురు నాయకులు పాల్గొన్నారు. విగ్రహ కమిటీ సభ్యులు పాముదుర్తి నాగేశ్వర రావు, బాసాటి సాల్మన్, కలుగూరి నాగరాజు తదితరులు వీరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

పలుచోట్ల అన్న సంతర్పణ

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని వైఎస్సార్‌సెంటర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా మహిళల చేత కోలాట కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. మహిళలు నిర్వహిస్తున్న కోలాటాన్ని చూసేందుకు భారీగా భక్తులు, ప్రజలు తరలి వచ్చారు. తాడేపల్లిలో వున్న వాసవీ నటరాజ కోలాటమండలి ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్ మండపం వద్ద కోలాటం నిర్వహించిన ప్రతిఅక్కా చెల్లెమ్మలకు కమిటీ నిర్వాహకులు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నులకపేటలో....

ఎంటీ ఎంసీ పరిధిలోని నులకపేటలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శ్రీ విఘ్నేశ్వర వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జెసీయస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబోతుల దుర్గారావు, సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, యస్‌టి సెల్ కన్వీనర్ బాలసాని అనీల్, కురుగొళ్ల రమేష్, షేక్ సుభాని, కుంచాల శ్రీను, షేక్ జిలాని, టీఎంఆర్ యూత్ సభ్యులు తుమ్మలపూడి మహేష్ రెడ్డి, అందే అశోక్‌కుమార్, తాడేపల్లి రూపేష్, యశ్వంత్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

మహానాడులో....

తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు 16వ రోడ్‌లో శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఎంటిఎంసి నగర అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ కౌన్సిలర్ చిన్నపోతుల దుర్గారావులు విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంక్రాంతి అశోక్, సంక్రాంతి వెంకటేశ్వర్లు, గోగుల వెంకటేశ్వరరావు, సంక్రాంతి ఈశ్వరరావు, ఎర్రగూటి మల్లిఖార్జునరెడ్డి, కె. రవి, చింత ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బైబై గణేశా...

ఫిరంగిపురం: మండలకేంద్రంతో పాటు పలుగ్రామాల్లో గణపతికి చేస్తున్న పూజలు మూడోరోజుకు చేరాయి. మండలకేంద్రంలోని తూర్పుబజారులోని ఏకలవ్యయువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పూజలు చేసి మూడోరోజు బుధవారం అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించి నిమజ్జనానికి అమరావతికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఫిరంగిపురం: ప్రమాదవశాతు మోటారు సైకిల్‌ను ఎదురుగా వచ్చినలారీ ఢీకొట్టడంతో వైద్యశాలలో చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వేములూరిపాడులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం ఏనుగువారిపాలెం గ్రామానికి చెందిన ఎన్. గాలేశ్వరరావు(36) తన భార్య రోజాతో కలిసి మోటారు సైకిల్‌పై గుంటూరు వెలుతున్నాడు. ఈక్రమంలో మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన లారీ మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈసంఘటనలో గాలేశ్వరరావుకు తీవ్రగాయాలు కాగా రోజాకు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిద్దరిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్సకోసం తరలించారు. చికిత్సపొందుతూ గాలేశ్వరరావు మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా కిషోర్ తెలిపారు.

ప్రకటన

[illegible]

T.V.N.వాసుదేవరావు అడ్వకేట్